క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కమేళా విద్యుత్ ఫీడర్ పరిధిలోని కమేళా, బహదూర్ పురా, కామాటిపురా ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బీఆర్ఎస్టీయూ ఇన్‌చార్జిగా శ్రీనివాస్



చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ (బీఆర్ఎస్టీయూ) చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఆకుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ ఆయనకు తెలంగాణ భవన్‌లో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో భవన నిర్మాణ రంగం, జలమండలి తదితర రంగాల కార్మికుల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సినిమాల్లో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ యాస

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత తెలుగు సినిమాలలో తెలంగాణ భాష, యాస, సంస్కృతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ థియేటర్స్, మీడియా రిస్తా సంస్థ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహిస్తున్న డబ్బింగ్, వాయిస్ ఓవర్ శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బింగ్ శిక్షణ తరగతులను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు రమేష్ కిషన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన యువత ఏప్రిల్ 10 లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 7396817623 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

సామూహిక కుంకుమార్చన



డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడి రామాలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. 2వ తేదీ సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపును పుర వీధుల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

చార్మినార్: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ అన్నారు. రంజాన్ మాసంలో మక్కా మసీదు, చార్మినార్ పరిసరాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మక్కా మసీదు–చార్మినార్ రోడ్డులోని గ్రానైట్ రోడ్లను వాటర్ ట్యాంకలతో శుభ్రం చేస్తున్నామని, దుమ్ము, ధూళీ లేకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సామూహిక ప్రార్థనలు, ఇఫ్తార్ విందుల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రంజాన్ మాసంలో ముస్లింలు తరావీ ప్రార్థనలు చేయాలి



మాట్లాడుతున్న నజీముద్దీన్ ఖాద్రీ

శాలిబండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తరావీ ప్రార్థనలు చేయాలని, మౌలానా సయ్యద్ షా మీర్జా నజీముద్దీన్ ఖాద్రీ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో రెండో శుక్రవారం సందర్భంగా ఆలిండియా సున్నీ ఉల్మా బోర్డు ఆధ్వర్యంలో జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని సూచించారు. రంజాన్ మాసంలో ఖురాన్ చదివితే పుణ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో మౌలానా హమీదుద్దీన్ షత్తారీ పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చార్మినార్ మండల డిప్యూటీ ఈఓ నెప్రూబాబు





యాకుత్‌పురా: ఏప్రిల్ 3 నుంచి నిర్వహించనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యాశాఖ చార్మినార్ మండల డిప్యూటీ ఈఓ ఐ.నెప్రూబాబు తెలిపారు. శుక్రవారం యాకుత్‌పురాలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షల నేపథ్యంలో మండల పరిధిలో 26 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల పరిధిలో 7 ప్రభుత్వ, 19 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 4,141 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1,089, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 3,052 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. పరీక్ష హాళ్లలో వెంటిలేషన్ ఉంటుందని, తాగునీరు టాయిలెట్లు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మోడల్ పేపర్లను అందజేశామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. ఉదయం 9.30 గంటలను నుంచి మధ్యాహ్నం 12.30 వర కు నిర్వహించే పరిక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తామని, విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా హాల్ టికెట్‌తో సమయానికి ముందుగానే కేంద్రాలకు రావాలని సూచించారు.

'ఊహలకే ఊపిరి వస్తే' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం కవులు, కళాకారులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తుందని శాసనమండలి సభ్యురాలు ఎస్.వాణీదేవి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ పాతనగర కవుల వేదిక, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కె.హరనాథ్ రచించిన ''ఊహలకే ఊపిరివస్తే'' అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రచయిత్రులు, కవులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు కవి రాపోలు సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రముఖ కవి సుధామ, జాతీయ వినియోగదారుల పోరం వైస్ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ ఎ.కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ: నృత్య దీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో నృత్య గురువు లక్ష్మీశంకర్ శిష్యురాలు కుమారి సృష్టి నిధి కూచిపూడి రంగప్రవేశం శుక్రవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. సిద్ధివినాయక, రాధాకృష్ణ, కోదండ పాణి, త్యాగరాజ కృతులపై చక్కటి హావభావాలతో ప్రదర్శించిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రామలింగశాస్త్రి, సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ వైద్య నిపుణులైన పలువురు న్యూరో ఫిజీషియన్లు, న్యూరో సర్జన్లు, కార్డియాలజిస్టులు, సైకాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్ల పర్యవేక్షణలో మానసిక, గుండె రుగ్మతలు లేని నగరంగా హైదరాబాద్‌ను మార్చడంలో వైద్యులు తమవంతు పాత్ర పోషించాలని డాక్టర్ జలీల్ కిర్మానీ పిలుపునిచ్చారు. శుక్రవారం మీడియా ప్లస్ ఆడిటోరియంలో పేదలకు తక్కువ ఖర్చుతో ఖరీదైన వైద్యం అందించేందుకు ఏప్రిల్ 2న అమెరికన్ బ్రెయిన్ అండ్ స్పైన్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్‌ను టోలీచౌకీలో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఎడుగురిలో ఒకరు మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని వెల్లడించారు. తలనొప్పి, మెడనొప్పి వంటి సమస్యలన్నీ మానసిక సమస్యలకు సంకేతమని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్ వెంకట్ హరిన్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ముహమ్మద్ హుసైన్, డాక్టర్ అబూజర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బంగారు ఆభరణాల ఎగ్జిబిషన్



గన్‌ఫౌండ్రీ: బషీర్‌బాగ్‌లోని బింద్రా డైమాండ్ షోరూంలో పలువురు సినీ నటులు, మోడల్స్ సందడి చేశారు. ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న బంగారు ఆభరణాల ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి మౌనిక, బావిరెడ్డి, సంస్థ ఎండీ మాధవ్ బంగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు సీఎం న్యాయం చేస్తున్నారు'



ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ను సత్కరించిన అరుణ్‌కుమార్, దినకర్

అబిడ్స్: నూతన ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తెలంగాణ ఉద్యమ నాయకుడు దేశపతి శ్రీనివాస్‌ను రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకుడు మాచర్ల దినకర్ సత్కరించారు. శుక్రవారం ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో దేశపతి శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారన్నారు. ఉద్యమకారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయం చేస్తున్నారన్నారు. బోడంపాటి సత్యనారాయణగౌడ్, రత్నదీప్ పాల్గొన్నారు.

తెలుగు సంబరాలకు రావాలని గౌరీశంకర్‌కు ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: అమెరికాలో మే 26 నుంచి నిర్వహించే తెలుగు సంబరాలకు హాజరు కావాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం రవీంద్రభారతిలో నార్త్ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు ఎన్.బాపయ్య చౌదరి ఆయనకు ఆహ్వానపత్రిక అందజేశారు. తెలంగాణ సంస్కృతి, ఉద్యమంపై ముద్రించిన ఆంగ్ల గ్రంథాన్ని ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కిశోర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలకు అండగా నిలవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: ప్రతి ఒక్కరూ మహిళలకు అండగా నిలవాలని పూర్వ సమాచార శాఖ కమిషనర్, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల అన్నారు. శుక్రవారం కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలోని అల్యూమిని భవన్ ఆడిటోరియంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలందరినీ ఒకే వేదిక మీదకు తీసుకురావడం అభినందనీయమన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ప్రతి మహిళా ఉద్యోగికి ఈ అసోసియేషన్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలక్ష్మి, పేట్లబుర్జు మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, సైఫాబేగం, డాక్టర్ గీత, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.విజయనిర్మల పాల్గొన్నారు.

ఇంద్రాని మహావిద్యాలయ్ వార్షికోత్సవం



జియాగూడ: ఇంద్రాని మహావిద్యాలయ్ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతుందని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడలోని ఎంసీహెచ్ ప్లేగ్రౌండ్‌లో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ మిథిలేష్‌కుమార్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, అక్షదీప్ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ అక్రమ్ అలీ, ట్రస్మా ఉపాధ్యక్షుడు బి.గాలయ్య, ట్రస్మా ఆసిఫ్‌నగర్ మండల్ ప్రధాన కార్యదర్శి జితేందర్ సింగ్ పాల్గొన్నారు.

అర్హులకు త్వరగా షాపులు కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న శైలేష్‌కురుమ, ప్రదీప్‌రాజ్ తదితరులు

అబిడ్స్: బేగంబజార్ చేపల మార్కెట్‌లో అర్హులైన వారందరికీ వేగవంతంగా షాపులు కేటాయించాలని కోరుతూ జీహెచ్ఎంసీ ఎస్టేట్ విభాగం అధికారి వినోద్‌కుమార్‌కు గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు కోటి శైలేష్ కురుమ, కోళ్ల ప్రదీప్‌రాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతమందికే షాపులు కేటాయించారని, మిగిలిన వారికి సైతం వేగంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు షాపుల కేటాయింపుపై విజ్ఞప్తి చేయగా వేగంగా కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పప్పుమాత్రే విష్ణువర్ధన్, గోపాల్‌సింగ్, పతే సింగ్, శివదర్శన్ సింగ్, జైపాల్ సింగ్ పాల్గొన్నారు.

'రాహుల్‌పై అనర్హత వేటు దుర్మార్గమైన చర్య'

దూద్‌బౌలి: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సమీర్ వలీ ఉల్లా అన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ శుక్రవారం చార్మినార్ వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. హైదరాబాద్ డీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్, కె.ఎస్.ఆనంద్‌రావు, ముజీబుల్లా షరీఫ్, కలీం బాబా, తహసీన్ ఫాతీమా, మీర్జా అస్కారీబేగ్, షాబాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



చార్మినార్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గోమాతకు పూజలు

గోల్కొండ: సీతారాముల కల్యాణం, శ్రీరామ శోభాయాత్రలు విజయవంతం కావడం శ్రీరాముడిపై ప్రజలకు ఉన్న భక్తిని చాటిచెబుతున్నాయని కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఆయన గోమాతకు పూజలు నిర్వహించారు.

పాత కక్షలతో గొడవలు.. ముగ్గురికి గాయాలు

నాంపల్లి: మాన్గార్ బస్తీలో పాత కక్షలు భగ్గుమన్నాయి. ఒకరిపై ఒకరు రాడ్లు, కత్తులతో దాడి చేసుకున్నారు. కంట్లో కారం చల్లుకుంటూ రాళ్లు విసురుకున్నారు. ఈ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాన్గార్ బస్తీలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కాంబ్లే నరేష్, హెచ్.పృధ్వీరాజ్ కుటుంబాల మధ్య ఆరేళ్లుగా గొడవలు కొనసాగుతున్నాయి. ఈ నెల 27న అర్ధరాత్రి వీరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో అన్నదమ్ములైన రాజు (32), శివరాజ్ (30), రాజేష్ (28) కత్తిపోట్లకు గురయ్యారు. గాయాలపాలైన ముగ్గురిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు కోలుకుని ఇంటికి వచ్చారు. కాంబ్లే సచిన్, కాంబ్లే చింటూ, రాజేందర్, గజేందర్, పేడియా, లఖన్, బోలే, బిర్జూ, కాంబ్లే హీరా, ఘోరీ, బర్ఫీ, వందన తమపై దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. బస్తీలో జరిగిన దాడి విషయంపై హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదబాబును వివరణ కోరగా బస్తీలో ఇలాంటివి మామూలేనంటూ సమాధానమిచ్చారు. చిన్న విషయాలను సైతం పట్టించుకుంటే ఎలా అంటూ వివరణ ఇచ్చారు.

మజ్లిస్ నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలి



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలో నానల్ నగర్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మజ్లిస్ పార్టీలో పదవులు అలంకార ప్రాయం కావని, కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయన్నారు. పదవులను నిలబెట్టుకోవాలంటే నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, అలీమొద్దీన్, సయ్యద్ అబ్బాస్ హుస్సేన్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అత్యాధునిక యంత్రాలను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ విరాళంగా అందించడం అభినందనీయమని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రిలోని యూరాలజీ విభాగంలో సుమారు రూ.50 లక్షల విలువ చేసే అత్యాధునిక యంత్రాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శశికళారెడ్డి, ఆర్ఎంఓ –1 డాక్టర్ శేషాద్రి, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణితో కలిసి ప్రారంభించారు. సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ.. సీఎస్ఆర్ కింద పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సంస్థ అందించిన నిధులతో ఈ అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ యంత్రాల ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించే ఖరీదైన వైద్యసేవలను ఉస్మానియాలో పూర్తి ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని కార్పొరేట్ సంస్థలు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్, ప్రొఫెసర్ రామకృష్ణ, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పాండు నాయక్, డాక్టర్ శ్రీధరాల శ్రీనివాసులు, ఆర్ఎంఓ డాక్టర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కారం అందజేస్తున్న రమణాచారి

సుల్తాన్‌బజార్: సృజన భారతి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు శుభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలను శుక్రవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై పలువురికి పురస్కారాలు అందజేశారు. మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నెల్లూరు శివారెడ్డి, తెలుగు జానపద సాహిత్య పరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ చింతలపల్లి వసుంధర రెడ్డి, డాక్టర్ ఎం.కె. రాము ముదిరాజ్, సుజాతరెడ్డి, పాల్వాయి సుమతి నరేంద్ర, నారా కృష్ణమూర్తి, వనం శంకరయ్య, మేక రామకృష్ణ, వెంకటరమణ తదితరులకు రమణాచారి చేతుల మీదుగా ఉగాది పురస్కారాలను అందజేశారు. కొమ్మూరి ప్రసాద్, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

తరుణ్‌చుగ్‌ను కలిసిన దేవర శ్రీనివాస్



తరుణ్‌చుగ్, బండి సంజయ్‌తో దేవర శ్రీనివాస్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడం ఖాయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ శుక్రవారం తరుణ్‌చుగ్‌తో పాటు బండి సంజయ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ కుమారుడు దేవర వంశీని తరుణ్‌చుగ్‌కు పరిచయం చేశారు. మొదటి ప్రజాసంగ్రామ యాత్రలో భోజన విభాగానికి దేవర శ్రీనివాస్ సమర్థవంతంగా సేవలు అందించారని శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట శ్రీకాంత్ సాగర్, అశ్విన్, ప్రభు తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్‌యాదవ్ సేవలు అభినందనీయం

అఫ్జల్‌గంజ్: గడ్డం గంగాధర్‌యాదవ్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ సేవలు అభినందనీయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జి.యాదగిరి, రవీంద్రచారి, మేఘ్యా నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గౌలిగూడలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కరోనా విజృంభిస్తున్న సమయంలో దాదాపు 52 రోజుల పాటు పేదలకు నిత్యావసర సరుకులు అందించడంతో పాటు పేదలకు ఫౌండేషన్ ద్వారా ఉచిత విద్య అందిస్తున్నట్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సృజనాత్మకత వెలికితీతకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం



అరవింద్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన పాఠశాల చైర్మన్ శ్యామ్ వెరా తదితరులు

జియాగూడ: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని సంఘ సేవకుడు అరవింద్‌కుమార్ గౌడ్, జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జియాగూడలోని విద్యశ్రీ హైస్కూల్‌లో విద్యశ్రీ ఎక్స్‌పో 2023 నిర్వహించారు. స్కూల్ చైర్మన్ శ్యామ్ వెరా, సునితా శ్యామ్‌వెరా ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు 500 రకాల ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ మాట్లాడుతూ.. జియాగూడలో 35 సంవత్సరాలుగా విద్యశ్రీ స్కూల్ యాజమాన్యం విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు జి.శివరత్నం, డివిజన్ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం



జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్

అబిడ్స్: తాగునీరు, డ్రైనేజీ సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని 4వ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ పేర్కొన్నారు. జాంబాగ్, కట్టెలమండి తదితర ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ, బోర్‌వెల్స్ సమస్యలను పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ జనరల్ మేనేజర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు వెంటనే పర్యటించి సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. అహ్మద్, గౌస్, యూసుఫ్, ఆసీఫ్, జహంగీర్, సలీం పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే



అబిడ్స్: విద్యార్థులకు అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్ జితేందర్‌సింగ్ పేర్కొన్నారు. శివలాల్‌నగర్‌లోని పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.